క్లుప్తంగా

ఆదిత్యాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఈఓకు విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష నగదు విరాళాన్ని ఆలయ పాలకమండలి సభ్యురాలు ద్వారపు అనూరాధ, అజిత్‌కుమార్ దంపతులు ఆదివారం ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. తల్లిదండ్రులు బొత్స వెంకటరావు, జయలక్ష్మిల జ్ఞాపకార్థం ఆలయంలో అభివృద్ధి పనులు చేయించాలని అనూరాధ కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు మండవల్లి రవి, కోటేశ్వర చౌదరి, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవి.పద్మావతి తదితరులున్నారు. అనంతరం ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

వెండి మెట్టు బహూకరణ



వెండి మెట్టును బహూకరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పాలకొండ రోడ్డులో కోదండ రామాలయంలో స్వామివారికి రామభక్త బృందం ప్రతినిధులు వెండి మెట్టును ఆదివారం బహూకరించారు. కార్యక్రమంలో రామభక్త బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ఉపశమనం



సేద తీరుతున్న ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు వేసవి ఉక్కపోత, ఎండ వేడిమి నుంచి తప్పించుకునేందుకు కూలర్ తరహాలో రెండు భారీ ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు. ధారాళంగా గాలి రావడంతో ప్రయాణికులు ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

మెకానిక్ కుటుంబానికి సాయం



రామకృష్ణ కుటుంబానికి సాయం అందిస్తున్న మెకానిక్‌లు

రణస్థలం: పదేళ్లుగా రణస్థలం మండల కేంద్రంలో మెకానిక్‌గా పనిచేస్తున్న బెందాన రామకృష్ణ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందాడు. పేద కుటుంబం కావడంతో రణస్థలం, లావేరు మండలాల టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున మెకానికులంతా కలిసి రామకృష్ణ కుటుంబానికి ఆదివారం రూ.50 వేలను అందజేశారు. మృతుడి స్వగ్రామం లావేరు మండలం మెట్టవలస పంచాయతీ నీలాపురం. కార్యక్రమంలో మెకానిక్‌లు కోడి ఈశ్వరరావు, పిన్నింటి కోటి, గూడెల రాంబాబు, రమణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు భరోసా



సరుకులు అందిస్తున్న పిళ్లా ఆనందపాత్రుడు

జి.సిగడాం: మండలంలోని సేతుభీమవరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బొల్లు నారాయణరావు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ పిళ్లా ఆనందపాత్రుడు అన్నారు. ఆదివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందించారు. గృహ నిర్మాణం కోసం తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత మహంతి సత్యనారాయణ, సహకార సంఘ డైరెక్టర్ పైల త్రినాథరావు, జమ్మినాయుడు, రమణ, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని సూర్యమహల్ కూడలిలోని పెట్రోల్ బంకు వద్ద వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. 35 నుంచి 40 ఏళ్ల వయసు గల , చుట్టుపక్కల యాచన తెలిపారు. వీఆర్‌ఓ బరాటం నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు

సత్తాచాటిన సర్కారు స్కూళ్లు



శ్యామల(583)కు మిఠాయి తినిపిస్తున్న పైడిభీమవరం హెచ్‌ఎం పద్మావతి



పద్మశ్రీకు స్వీట్ తినిపిస్తున్న ప్రిన్సిపాల్ హైమావతి



రాగోలు విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం



శ్రీకాకుళంలోని అంధవరపు వరాహ నరసింహం మున్సిపల్ హైస్కూల్

- ఫలితమిచ్చిన ప్రభుత్వ చర్యలు
- పదో తరగతిలో ఉత్తమ ఉత్తీర్ణత శాతం, మార్కులు కైవసం



తమ్మినేని మౌనిక (588)



హన్సిక (574)



హర్షవర్ధన్ (587)



సాయిగౌతమ్ (570)



రాహుల్ (572)



కె.తేజశ్విని (587)



సాహిత్య (582)



పాగిరి ఇందు 582

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాలలో ప్రతిభ చాటుకున్నారు.నగరపాలకసంస్థ పరిధిలో ఏడు ఉన్నత పాఠశాలలు ఉండగా ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఏవీఎస్ఎం హైస్కూల్ 81శాతం ఉత్తీర్ణతతో ప్రథమంగా నిలిచింది. మిగిలిన ఆరు పాఠశాలల్లో 70 శాతం పైబడి ఫలితాలు వచ్చాయి. బలగ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థిని తమ్మినేని మౌనిక 588 మార్కులు సాధించి శ్రీకాకుళం నగర పాఠశాలల నుంచి ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాస్థాయిలో 5వ స్థానాన్ని దక్కించుకుంది. బాలిక తండ్రి రామమనోహర్ ప్రయివేటు ల్యాబ్‌లో టెక్నీషియన్ కాగా తల్లి సరస్వతి గృహిణి. ఇదే పాఠశాలలో చదువుతున్న డి.హాన్సిక 574 మార్కులు సాధించింది. ఈమె తండ్రి జగదీశ్వరరావు మృతిచెందగా తల్లి కృష్ణవేణి రిమ్స్‌లో పనిచేస్తూ పిల్లలను చదివిస్తోంది. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహంతో పిల్లలను చదివించగలుగుతున్నట్లు కృష్ణవేణి 'సాక్షి'కి తెలిపారు. అరసవల్లి నగర పాలక పాఠశాలలో చదువుతున్న రావాడ హర్షవర్ధన్ 587 మార్కులు సాధించాడు. ఇతని తండ్రి తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. తల్లి గృహిణి. ఏవీఎస్ఎం హైస్కూల్‌లో చదివిన బి.రాహుల్ 572, జల్లేపల్లి సాయిగౌతమ్ 570 మార్కులను సాధించారు. వీరిద్దరు కూడా నిరుపేద కుటుంబానికి చెందిన వారే. ఇలా మరెందరో కూడా అత్యధిక మార్కులను సాధించారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని కె.తేజశ్విని 587 మార్కులు సాధించడంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రణస్థలం: పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోరు శ్యామల 583 మార్కులు సాధించడంతో హెచ్ ఎం.పద్మావతి అభినందించారు. తండ్రి గౌరిపతిరావు సెక్యూరిటీ గార్డు. తల్లి గీత గృహిణి.

రణస్థలం: లంకపేట కేజీబీవీలో పదో తరగతి ఫలితాల్లో 48 మందికి గాను 38 మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన అట్లా పద్మశ్రీని ప్రిన్సిపాల్ ఎస్.హైమావతి, ఉపాధ్యాయులు అభినందించారు. తండ్రి అప్పారావు ప్రైవేటు ఉద్యోగి. విద్యార్థిని స్వగ్రామం ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు.

జి.సిగడాం: జి.సిగడాం మోడల్ పాఠశాల నుంచి 98 మంది పరీక్షలకు హాజరుకాగా 97 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పాగిరి ఇందు 582 మార్కులు సాధించింది.

శ్రీకాకుళం రూరల్: రాగోలు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 112 మంది విద్యార్థులు హాజరు కాగా 96 మంది ఉత్తీర్ణత సాధించారు. గురుగుబెల్లి వినీత(583), తంగి తనూజా(576) ఉత్తమ మార్కులు సాధించారు. వీరిని హెచ్‌ఎం అభినందించారు.

గార: గార జెడ్పీహెచ్ఎస్ నుంచి ఎం.సాహిత్య 582 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.అంపోలు జెడ్పీహెచ్ఎస్ నుంచి కె.వినీల 581 మార్కులు సాధించారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

చదువుపై శ్రద్ధ..



ప్రభుత్వ చర్యలు అత్యుత్తమ మార్కుల సాధనకు దోహదపడ్డాయి. సకాలంలో పుస్తకాలు సరఫరా చేయడం, పౌష్టికాహారం ఇవ్వడం, అమ్మ ఒడి వంటి పథకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టగలిగారు. వారాంతం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలు ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదపడ్డాయి. జిల్లాలోనే దీనిని ప్రారంభించగా రాష్ట్రవ్యాప్తంగా వీటిని అమలు చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి.

– పి.ఇందిరామణి, ప్రధానోపాధ్యాయురాలు, ఏవీఎస్ఎంహైస్కూల్

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



లావేరులో అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు



రణస్థలం: పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న లైబ్రేరియన్, విద్యార్థులు

లావేరు: మండలంలోని మురపాక, లావేరు శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 8వ నుంచి జూన్ 11 వరకూ జరగనున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ మురపాక శ్రీనివాసరావు కోరారు. ఆదివారం విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి వేసవి విజ్ఞాన శిబిరాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను గ్రంథాలయాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ప్రత్యేక వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల గ్రంథాలయ అధికారి జి.నీలమ్మ కోరారు. ఎచ్చెర్ల గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు.

రణస్థలం: రణస్థలం శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ పి.వరలక్ష్మి కోరారు. రణస్థలం శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి విజ్ఞాన శిబిరాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ వ్యవస్థను నిర్మూలిద్దాం



నివాళులు అర్పిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం రూరల్: అరుణోదయ సాంస్కృతిక ఉద్యమ సేనాని అరుణోదయ రామారావు అమరత్వ స్ఫూర్తితో ఆయన ఆశయాలను కాపాడుకుందామని, దోపిడీ వ్యవస్థను నిర్మూలిద్దామని అరుణోదయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తరోడ్ జంక్షన్ వద్ద న్యూడెమొక్రసీ కార్యాలయంలో అరుణోదయ రామారావు నాలుగో వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహ కార్యదర్శి డి.గణేష్, నవలాపురం కృష్ణవేణి, మామిడి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సాయం



యువతకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని గుమడాం పంచాయతీ నాగంపాలెం ఎస్సీ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల గుమడాం పంచాయతీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నాగంపాలెం యువత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లావేరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు జగ్గరోతు తవిటినాయుడు, జగ్గరోతు జగదీష్, నాగంపాలెం ఎస్సీ కాలనీ యువత పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



సీతారాముల విగ్రహాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

గార: అంపోలులో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరుగుతున్న ఈ మహోత్సవంలో చివరి రోజు స్వామి విగ్రహ ప్రతిష్ఠలను కళింకోటకు చెందిన రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సీతారామచార్యులు, గ్రామ పురోహితులు ఆరవెల్లి గురునాథంబాబు, జగదీష్, శ్యామసుందర శర్మ, ప్రదీప్‌శర్మల శాస్త్రోక్తంగా నిర్వహించారు. చివరిలో పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఈ రామాలయ ప్రతిష్ఠలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

విశ్వకవి స్ఫూర్తి విశ్వజనీయం



గాంధీ మందిరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డీఈఓ తిరుమల చైతన్య



అల్లూరి, రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఇస్కఫ్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం : విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్ఫూర్తి విశ్వజనీయమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య అన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 162వ జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనంలో విగ్రహదాత సాలిగుండం రవికుమార్, శ్రీదేవితో పాటు తిరుమల చైతన్య తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి విశ్వకవి అందించిన గీతాంజలి కావ్యం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిరం కమిటీ ప్రతినిధులు బరాటం లక్ష్మణరావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, కొంక్యాన వేణుగోపాల్, మహీబుల్లా ఖాన్, పందిరి అప్పారావు, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, సత్తిబాబు, తర్లాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇతర దేశాలతో మైత్రిని పెంపొందించుకుని సహాయ సహకారాన్ని అందిపుచ్చుకున్నప్పుడే ప్రపంచంలో శాంతి, సంస్కృతులను కాపాడుకోగలమని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని రామలక్ష్మణ కూడలిలో దాసరి క్రాంతి భవన్‌లో ఆదివారం ఇస్కఫ్ జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షుడు ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, అల్లూరి సీతారామరాజు వర్ధంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి జి.వి.నాగభూషణరావు, ఇస్కఫ్ వర్కింగ్ అధ్యక్షుడు ఎ.రాజు, పొడుగు రాజు, కరకవలస శ్రీను, కిరణ్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కవిటి: పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాల్లో పనిచేస్తూ మృతి చెందిన శీమూరు గ్రామానికి చెందిన శివంగి గురుమూర్తి కుటుంబానికి అగ్నికుల క్షత్రియ జిల్లా సంఘం, స్టేట్‌యూత్ ఫోర్స్ సభ్యులు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. సంయుక్తంగా 70 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం ప్రధాన కార్యదర్శి పులకల శ్రీరాములు, మండల సంఘం అధ్యక్షుడు పొల్లాయి లక్ష్మణమూర్తి సమక్షంలో గ్రామపెద్దలతో కలిసి మృతుని కుటుంబానికి ఆదివారం అందజేశారు. భవిష్యత్‌లో కూడా ఈ పేదకుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులకు విద్యాపరంగా పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని యూత్‌ఫోర్స్ స్టేట్ టీంసభ్యులు ప్రకటించారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గార: కొర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ కలయిక అదే స్కూల్లో ఆదివారం జరిగింది. సర్పంచ్ పీస గోవిందరాజులు అధ్యక్షతన విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులతో పాటు గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, విద్యా కమిటీ చైర్మన్లతో పాటు చమళ్ల రమేష్, ఎ.ఉమాశంకర్, వజ్జ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి పండగలు ప్రారంభం



ఉజ్జిడి బండి తిప్పుతున్న భక్తులు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో ఆదివారం నుంచి అమ్మవారి పండుగలు ప్రారంభమయ్యాయి. 12 ఏళ్ల తరువాత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 16 వరకు పండుగలు నిర్వహిస్తారు. గ్రామంలో ఉజ్జిడి బండి తిప్పి ఉత్సవాలు ప్రారంభించారు. గ్రామ దేవత, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీడి పిక్కలు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

కొత్తూరు: జీడి పిక్కలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. కొత్తూరులో సీపీఎం సమావేశం ఆదివారం నిర్వహించారు. దళారుల చేతిలో జీడి పిక్కల రైతులు నష్టపోతున్నారన్నారు. జీడి పప్పు ధరలు పెరుగుతున్నా.. జీడి పిక్కల ధరలు మాత్రం పెరగకపోవడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. జీడి పిక్కలు 80 కిలోల బస్తా రూ.16వేలకు కొనుగోలు చేయాలన్నారు. వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం పూర్తిస్థాయిలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోతే దశల వారిగా ఉద్యమాలకు నిర్వాసితులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్, సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, తెల్లన్న తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న దాతలు

రణస్థలం: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని ఇడదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు ఇ.వి.సత్యనారాయణ అన్నారు. రణస్థలంలోని సూర్య ఆస్పత్రి వద్ద సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండు వేసవిని సైతం లెక్కచేయకుండా రక్తదానానికి ముందుకు వచ్చిన 68 మంది దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సేకరించిన రక్తనిధిని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఇ.తిరుపతిరాజు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, జె.ఆర్.పురం పంచాయతీ కార్యదర్శి లింగాల ఆదినారాయణ, సేవా సభ్యులు ఇజ్జు శ్రీనివాసరావు, రాయపురెడ్డి శ్రీనివాసరావు, మింగ్రాన రామారావు, తాజ్‌మొయిద్దీన్, పిన్నింటి సత్యంనాయుడు, దన్నాన రమణ, పసుపురెడ్డి సురేష్, గెడ్డపు వరం, చోడిశెట్టి చంద్రశేఖర్, కూనిబిల్లి సత్యారావు, అప్పుడుదొర, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ తొత్తిడి మణికంఠ పాల్గొన్నారు.

క్షణికావేశాలకు గురికావద్దు



మాట్లాడుతున్న సీఐ ఆదాం

లావేరు: క్షణికావేశాలకు గురై జీవితాలను బలిచేసుకోవద్దని జేఆర్ పురం సీఐ ఎస్.ఆదాం అన్నారు. లావేరు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలు వస్తే గ్రామాల్లో పెద్దల సమక్షంలోని గాని, పోలీసుల దృష్టికి గాని తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హితవుపలికారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులకు తెలియజేయాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనతో పాటు లావేరు ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు ఉన్నారు.